వైఎస్సార్ ఆసరాతో మహిళా సాధికారత

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వైఎస్సార్ ఆసరాతో మహిళా సాధికారత సాధించవచ్చని ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళలను ఆర్థికంగా ఎదగటానికి, స్వయం జీవనోపాధికై అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం తూర్పు నియోజకవర్గం 50వ డివిజన్ శారదాకాలనీలో జరిగిన 'వైఎస్సార్ ఆసరా' పథకం అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముస్తఫా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించటానికి డ్వాక్రా బృందాలుగా ఏర్పాటు చేశారని, తద్వారా పొదుపు చేసుకుంటూ ప్రభుత్వం నుంచి రుణాలు తీసుకుని స్వయం జీవనోపాధికై చిరు వ్యాపారాలు నిర్వహించుకోవచ్చన్నారు. డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు మాట్లాడుతూ 50వ డివిజన్‌లో 150 డ్వాక్రా గ్రూపులకు రూ. 88లక్షల వరకు వైఎస్సార్ ఆసరా వర్తిస్తుందన్నారు. తూర్పు వైసీపీ మహిళా నాయకురాలు నూరి ఫాతిమా, వైసీపీ డివిజన్ కన్వీనర్ చీదర్ల రాజేష్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

నరసింహుని దర్శించుకున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

విశాలాంధ్ర-మంగళగిరి : శ్రీ లక్ష్మీనరసింహస్వామిని కుటుంబ సమేతంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి రామకోటి రెడ్డి ఆయనకు ఆలయ అర్చకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.

వైసీపీవి ప్రజా వ్యతిరేక విధానాలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి బొబ్బిలి రామారావు విమర్శించారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో రామారావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేసిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. ప్రతి వారం ముఖ్యమంత్రి రిజర్వ్ బ్యాంక్‌కు వెళ్లి అప్పు తెచ్చుకోకుండా పూట గడవని పరిస్థితి ఉందన్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు, ఉపాధి లేక యువత అల్లాడిపోతున్నరు. ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతను ప్రజలు బయటపెట్టారు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలవడం ఖాయం... జగన్మోహన్ రెడ్డి, ఆయన బృందం ఇంటికి వెళ్ళడం ఖాయమని అన్నారు. కల్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల ఏర్పాట్ల పరిశీలన

విశాలాంధ్ర-గుంటూరు : హిందూ కాలేజ్ హైస్కూల్‌లోని పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలోని 10వ తరగతి పరీక్షా కేంద్రం చీఫ్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌లకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించవలసిందిగా సూచించారు. విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్ష రాయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు ఎటువంటి లోటు లేకుండా చేయవలసిందిగా సూచించారు. జిల్లాలో పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులు అందరూ ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలియజేశారు. జిల్లా విద్యాశాఖధికారి వెంట ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎస్‌కే ఎండీ ఖాసిం, పరీక్షా కేంద్రం చీఫ్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ పాల్గొన్నారు.

సూక్ష్మ పోషకాలు అందిస్తున్న 'వికాస్ ఆగ్రో ప్రొడక్ట్స్'

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గత 25 సంవత్సరాలుగా వికాస్ ఆగ్రో ప్రొడక్ట్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒరిస్సా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల రైతులకు సూక్ష్మ పోషకాలు అందించి, దినదినాభివృద్ధి చెందుతుందని వికాస్ ఆగ్రో ప్రొడక్ట్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కనగాల సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానికంగా జరిగిన డీలర్ల సదస్సులో సత్యనారాయణ మాట్లాడారు. నాణ్యమైన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంతో వివిధ సూక్ష్మ పోషకాలను, బయో ఫెర్టిలైజర్స్‌ను, బయో స్టిమిలెంట్స్‌ను రైతులకు అందిస్తున్నామని తెలియజేశారు. నాణ్యమైన పోషకాలతో పాటు ఈ సంవత్సరం నుండి కీటకనాశినులను తయారు చేసి దేశంలోని అన్ని రాష్ట్రాలకు అందించే లక్ష్యంతో ముందుకెళ్తామని తెలిపారు. ఈ 25 సంవత్సరాలుగా తమకు, తమ అభివృద్ధికి దోహదపడిన రైతాంగానికి, వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వి.విజయ్ కుమార్, వివిధ బ్రాంచీల మేనేజర్లు, డీలర్లు, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కీళ్ళ మార్పిడి ఆపరేషన్లపై అపోహలు వద్దు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కీళ్ళ మార్పిడి ఆపరేషన్లపై అపోహలు వద్దని, తీవ్రంగా మోకాళ్ల నొప్పులు ఉన్న వారు మిగతా జీవితాన్ని సౌకర్య వంతంగా గడిపేందుకు తప్పనిసరిగా ఆపరేషన్లు చేయించుకోవాలని సాయి భాస్కర్ హాస్పిటల్ అధినేత, ప్రముఖ కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ సహకారంతో స్థానిక తాలూకా ప్రాంగణంలో ఉన్న పెన్షనర్ల మీటింగ్ హాలులో ఆదివారం ఉదయం 11గంటలకు 'మోకాళ్ళ నొప్పులు-శస్త్ర చికిత్సలు'అనే అంశంపై ఆరోగ్య సభ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ అధిక బరువు, పోషకాహార లోపంతో వయస్సుతో సంబంధం లేకుండా కీళ్ళ నొప్పులు వస్తున్నాయన్నారు. మారిన జీవన విధానంతో ఒత్తిడి, కాల్షియం లోపం, మధుమేహం, రక్తపోటు వంటి కారణాలతో 50ఏళ్ళ వయసు దాటిన వారికి కీళ్ళ అరుగుదల సహజంగా ఉంటాయన్నారు. కీళ్ళ అరుగుదల సమస్యలు గుర్తించేందుకు తప్పనిసరిగా ఎముకల వైద్యులను సంప్రదించి నిర్ణీత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆపరేషన్ అంటే భయపడి నొప్పుల బిళ్ళలు పదేపదే వాడి మూత్రపిండాలు, గుండె జబ్బులు, కాలేయం, జీర్ణకోశ సమస్యలు బారినపడొద్దన్నారు. రక్తపోటు, మధుమేహం ఉన్నవారు సైతం శస్త్ర చికిత్స చేయించుకుని సంతోషంగా జీవనం కొనసాగించవచ్చని స్పష్టం చేశారు. కొండా శివరామిరెడ్డి, పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి ప్రభుదాసు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారెడ్డి, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పల్లపు ప్రాంతాలు జలమయం

విశాలాంధ్ర-తాడికొండ : మండలంలో ఆదివారం సాయంత్రం తీవ్ర వర్షం పడింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉరుములతో కూడిన వర్షం పడింది. 40 నిమిషాల పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. మిర్చి, జొన్న, మొక్కజొన్న, శనగ రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇంటింటికి వెళ్తాం.. ప్రజావ్యతిరేక పాలనపై వివరిస్తాం...

- 14 నుంచి సీపీఐ, సీపీఎం ప్రచార కార్యక్రమాలు
- జిల్లా వ్యాప్తంగా పాదయాత్రలు, సభలు, సమావేశాలు
- జంగాల, పాశం వెల్లడి

విశాలాంధ్ర-గుంటూరు : సీపీఐ, సీపీఎం జాతీయ స్థాయి పిలుపులో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14వ తేది నుంచి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలన గురించి ప్రజలకు వివరించేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు తెలిపారు. గుంటూరు మల్లయ్య లింగంభవన్‌లో ఆదివారం సీపీఐ-సీపీఎం సంయుక్తంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభు త్వం అవలంబిస్తున్న కార్పొరేట్, మతోన్మాద అనుకూల, ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలనపై సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఉమ్మడి ప్రచార కార్యక్రమ ప్రణాళికను రూపొందించారన్నారు. బీజేపీ కేంద్రంలో అధికారం చేపట్టిన తరువాత మతోన్మాద చర్యలు ప్రోత్స హిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసరాలతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటాయని, నిరుద్యోగం పెరిగిపోయిం దని ఆవేదన వ్యక్తం చేశారు. రాఫెల్, అదానీ ఆర్థిక కుంభకోణం, రాజ్యాంగంపై దాడి తదితర చర్యలతో దేశ ప్రతిష్టను దెబ్బతీస్తుందని మండిపడ్డారు. అదేవిధంగా ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధికి, రాజధాని, పోలవరం నిర్మాణాలకు నిధులు ఇవ్వలేదని, హోదా విషయంలో మాట తప్పిందని, విశాఖ ఉక్కు పరి శ్రమను కాపాడే విధంగా ఎటువంటి ప్రతిపాదనలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతా జరుగుతున్న రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రాల హక్కులను బీజేపీ ప్రభుత్వం హరించివేస్తుందని, సీబీఐ, ఈడీ వంటి సంస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్ష నాయకులను జైళ్లల్లో పెడుతుందని విమర్శించారు. ఈ నేపథ్యంలో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా ఇంటింటికి సీపీఐ, సీపీఎం పేరుతో ప్రచార కార్యక్రమాలను తీసుకోవడం జరిగిందన్నారు. మోదీ పరిపాలనతో ఏర్పడ నున్న ప్రమాదాన్ని ప్రజలకు వివరిస్తామని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నామని, అదేవిధంగా పాదయాత్రలు, సభలు, సమావేశాలు, పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రజలను సైతం చైతన్య వంతులను చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 14వ తేది నుంచి 30వ తేది వరకు జరుగనున్న ఈ ప్రచార కార్యక్రమాలలో భాగంగా 14వ తేదిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ప్రచారాన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్లు వివరించారు. ఆయా కార్యక్రమాలలో పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, సీపీఎం నగర కార్యదర్శి కె.నళినికాంత్, సీపీఐ జిల్లా నాయకులు చిన్ని తిరుపతయ్య, మేడా హనుమంతరావు, పచ్చల శివాజీ, ముప్పాళ్ల శివశంకర రావు, పుప్పాల సత్యనారాయణ, ఆరేటి రామారావు, సీపీఎం నాయకులు ఈమని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-మంగళగిరి : ఈ నెల 12న మంగళగిరిలో జరుగనున్న ఏఐటీయూసీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అన్నవరపు ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళగిరి శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం ఆదివారం జరిగింది. గుంటూరు జిల్లా ఏఐటీయూసీ మహాసభలు మంగళగిరిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా మహాసభలకు సంబంధించి ఏఐటీయూసీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అన్నవరపు ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. అనంతరం కామ్రేడ్ అన్నవరపు ప్రభాకర్ మాట్లాడుతూ ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాలు ప్రజా సంఘాలు, చేనేత కార్మిక సంఘం, తాపీ వర్కర్స్, రిక్షా వర్కర్స్ కార్మిక సంఘం ఆటో యూనియన్ కార్మిక సంఘం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్, అన్ని సంఘాల నాయకులు పాల్గొని జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లా మహాసభలకు అందరం పాల్గొని విజయవంతంగా నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల కాశయ్య, చిన్ని సత్యనారాయణ, జాలాది జాన్ బాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గండికోట దుర్గారావు, తాడేపల్లి సహాయ కార్యదర్శి తుడిమెళ్ళ వెంకటయ్య, చేనేత కార్మిక సంఘం నాయకులు బత్తూరి మోహన్ రావు, భాష, శివ, లక్ష్మీనారాయణ, సంపత్ రావు, సుభాని తదితరులు పాల్గొన్నారు.

'పెరియార్ రీడర్ పుస్తక పరిచయ సభ' జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఈ నెల 6న గుంటూరులోని రెవెన్యూ సర్వీసెస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవనంలో జరగనున్న ద్రవిడ ఉద్యమ నిర్మాత, ప్రత్యామ్నాయ సాంస్కృతిక ఉద్యమ నాయకుడు ఈవీ పెరియార్ రామస్వామి నాయకర్ రచనల సంకలనం 'పెరియార్ రీడర్ పుస్తక పరిచయ సభ' జరుగుతుందని వైసీపీ జిల్లా అధ్యక్షులు, మాజీమంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్ తెలిపారు. ఆదివారం నగరంలోని మద్రాస్ కాఫీ హెూటల్‌లో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతరం డొక్కా మాట్లాడుతూ ఈ నెల 6న జరగనున్న సభకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.కరికాళ వలవన్, ప్రధాన వక్తగా దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్, విశిష్ట అతిథిగా రెవెన్యూ సర్వీసెస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అధ్యక్షులు టి.దేవరాజ్‌లు పాల్గొంటారన్నారు. ఈ నెల 6న జరిగే సభకు కవి విల్సన్ అధ్యక్షత వహించనున్నారు. ఆహ్వాన పత్రిక ఆవిష్కరణలో కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి, సాహితీ సమితి సభ్యులు అలోకం పెద్దబ్బాయి, జొన్నలగడ్డ రామారావు, కవి ఎస్ఎం సుభాని, తాటికొండ నరసింహారావు, సీనియర్ పాత్రికేయులు బండారు సురేష్, కాపు శ్రీనివాస్, పారా అశోక్, బాబురావు, చంద్రపాల్, ఎస్సీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు మేడిద బాబురావు, సంకురి రాజారావులు పాల్గొన్నారు.

శక్తి కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు : రాష్ట్రంలో శక్తి కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు అన్నారు. బీజేపీ గుంటూరు జిల్లా కార్యాలయంలో గుంటూరు పశ్చిమ, తూర్పు అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్యనాయకులు, పోలింగ్ బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ సమావేశం ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పాటిబండ్ల రామకృష్ణ అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సోము వీర్రాజు మాట్లాడుతూ 3 నుంచి 6 పోలింగ్ బూతులను కలిపి ఒక శక్తి కేంద్రంగా గుర్తించాలని, ఆ కేంద్రానికి ఒక ప్రముఖ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కార్యకర్తలకు 25 పనులు నిర్దేశించామన్నారు. రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ వ్యాప్తికి క్షేత్ర స్థాయి నుంచి కృషి చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెలలో పాదయాత్రలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం దిశగా ప్రతి కార్యకర్త కార్యదీక్షతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో పాలపాటి రవికుమార్, తోట రామకృష్ణ, శనక్కాయల ఉమాశంకర్, శనక్కాయల అరుణ, జూపూడి రంగరాజు, యడ్లపాటి స్వరూప రాణి, చందు సాంబశివరావు, కాయితి సైదారెడ్డి, భీమినేని చంద్రశేఖర్, ఆవుల నాగేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితులు కమ్మవారు: సుజనా చౌదరి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: తాము అభివృద్ధి చెందుతూ సమాజంలోని మిగతా కులాల వారితో సఖ్యతగా ఉంటూ సమాజ హితం, అభివృద్ధి కోరుకునేవారు కమ్మవారని రాజ్యసభ మాజీ సభ్యులు యలమంచిలి సుజనా చౌదరి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక అరండల్ పేట కళాశాల విద్యార్థుల వసతిగృహం శత జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. హాస్టల్ పాలకమండలి అధ్యక్షులు డాక్టర్ కొండబోలు బసవ పున్నయ్య జ్యోతి ప్రజ్వలన చేయగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సృజన చౌదరి మాట్లాడుతూ 100 సంవత్సరాల క్రితం దాతల సహకారంతో ప్రారంభించబడిన వసతిగృహం వేలాదిమంది ఆకలి తీర్చి విద్యావంతులుగా ఎదిగి దేశ విదేశాలలో ప్రముఖులుగా రాణించటం వారి పూర్వజన్మ సుకృతం అన్నారు. హాస్టల్ అభివృద్ధికి పది సంవత్సరాలపాటు ప్రతి ఏడాది రూ.5 లక్షల రూపాయలు సృజన ఫౌండేషన్ ద్వారా అందిస్తామని చెప్పారు. బైపిసి ఇంటర్మీడియట్ గల విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఒకరికి తమ మెడికల్ కళాశాలలో ఉచిత సీటును కేటాయిస్తామని తెలియజేశారు. దాతలు అందిస్తున్న సహకారంతో విద్యార్థులు వారికి నచ్చిన రంగంలో ఉన్నతంగా రాణించాలని కోరారు. విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం తమ బాధ్యతగా అందిస్తున్న చేయూత అభినందనీయమని చెప్పారు. ఉపాధ్యక్షులు డాక్టర్ కె కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రొఫెసర్ యలవర్తి నాయుడమ్మ, మోటూరి హనుమంతరావు, సినీ నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, మాజీ పార్లమెంట్ సభ్యులు యడ్లపాటి వెంకట్రావు అనేకమంది ప్రముఖులు వసతి గృహంలో చదువుకొని ఆయా రంగాలలో ప్రముఖులుగా వెలుగొందారని చెప్పారు. ప్రముఖ వైద్యులు మద్దినేని గోపాలకృష్ణయ్య, రాయపాటి శ్రీనివాస్, యలమంచిలి శివాజీ, మాజీ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు, మాదల రత్నగిరి బాబు, డాక్టర్ పాపినేని శివశంకర్, కార్యదర్శి మందలపు బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.

7న సీపీఐ జిల్లా స్థాయి జనరల్ బాడీ సమావేశం: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు : సీపీఐ జిల్లా, నియోజక వర్గాల సమితి సభ్యులు, ప్రజా సంఘాల ముఖ్య కార్యకర్తల జిల్లా స్థాయి జనరల్ బాడీ సమావేశం ఈ నెల 7వ తేదిన ఉదయం 10 గంటలకు గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో జరుగనుందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశం పుప్పాల సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ గత సమావేశం నుంచి ఈ సమావేశం వరకు నిర్వహించిన పార్టీ కార్యకలాపాల నివేదికను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనరల్ బాడీ సమావేశానికి ముఖ్యఅతిధులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు హాజరౌతారన్నారు. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అన్ని రంగాల్లో తిరోగమన విధానాలు అమలు జరుపుతున్నారని అన్నారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ ఆర్థిక, పారిశ్రామిక రంగాన్ని ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీలకు అప్పనంగా కట్టబెడుతున్నారని అన్నారు. మతోన్మాద దాడులను మోదీ సర్కార్ ప్రోత్సహిస్తుందన్నారు. కార్మిక వర్గ హక్కులను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నపటికి రాక్షస ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. రైతాంగం తీరని వేదనతో విలపిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో విద్యార్థి, యువజన, మహిళ, దళిత, మైనారిటీ అన్ని వర్గాల ప్రజలను మేల్కొల్పేందుకు ఈ నెల 14వ తేది నుంచి 30వ తేది వరకు జరిగే ప్రచార ఆందోళనను జయప్రదం చేసేందుకు ఈ సమావేశం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. సమావేశానికి సీపీఐ జిల్లా సమితి సభ్యులు, నియోజకవర్గ సమితి సభ్యులు, ప్రజా సంఘాల ముఖ్య కార్యకర్తలు తప్పక హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట మాల్యాద్రి, చిన్ని తిరుపతయ్య, ముప్పాళ్ళ శివశంకర రావు, ఆరేటి రామారావు, పచ్చల శివాజీ, మేడా హనుమంతరావు, షేక్ వలి, బందెల నాసర్ జీ, తెనాలి పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కాంట్రాక్ట్ ఉద్యోగులు రెగ్యులర్ కాకుండానే రోజుకొకరు చనిపోతున్నారని, ఈ నేపథ్యంలో వారికి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఎ)జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా సీఎం వైఎస్ జగన్‌కు విన్నవించారు. స్థానిక గుంటూరు మెడికల్ కళాశాల ప్రాంగణంలోని ఏపీ జీఈఎ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో చాంద్‌బాషా మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ ముఖ్యమంత్రి అయి మూడున్నర సంవత్సరాలు అయినా నెరవేరక పోవటడం దుర్మార్గమన్నారు. రెగ్యులర్ వ్యవహారంపై ప్రభుత్వపరంగా ఎలాంటి స్పష్టత లేకపోవడం వలన కాంట్రాక్టు ఉద్యోగులు 200 రోజులకు పైగా రాష్ట్రవ్యాప్తం గా ఆందోళన బాట పట్టినా కూడా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. డిసెంబర్ 2022లోగా తీపి కబురు వింటారని మంత్రి బొత్స ప్రకటించి 6 నెలలు పూర్తయినా ఆ దిశగా చర్యలు లేకపోవడం దారుణమని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కోవిడ్ సేవలకు గుర్తింపుగానైనా అర్హులైన కాంట్రాక్టు ఉద్యో గు లను రెగ్యులర్ చేయాలని సీఎం జగన్‌కు ఫ్యాక్స్ ద్వారా పంపనున్నట్లు చెప్పారు. ఏపీ జీఈఎ జిల్లా ఉపాధ్యక్షులు మహేష్‌బాబు, హుస్సేన్ ఖాన్, సంయుక్త కార్యదర్శి, శ్రీనివాస్, హరికృష్ణ, నగరశాఖ అధ్యక్షులు నాగేశ్వర రావు, పొన్నూరు తాలూకా యూనిట్ అధ్యక్షులు హరిబాబు, నగరశాఖ కార్యదర్శి శివారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మట్ల ఆదివారం

విశాలాంధ్ర-తాడికొండ : క్రైస్తవుల పర్వదినం మట్ల ఆదివారం ఘనంగా జరిగింది. చర్చిల వద్ద చిన్నారులు సందడి చేశారు. రాజులకు రాజు ప్రభువులకు ప్రభువు మెస్సియా రాజుకు జయం అంటూ పురవీధులలో తిరిగారు. తెలుగు బాప్టిస్ట్ చర్చ్ లూథరన్ ఆర్‌సీఎం హోసన్నా మందిర్ ఆధ్వర్యంలో పిల్లలు గ్రామ పురవీధులలో తిరిగారు.

గతి తప్పుతున్న మనిషిని సవ్యంగా నడిపించేది సాహిత్యమే

విశాలాంధ్ర-గుంటూరు : సాహిత్యం సమాజాభివృద్ధికి, దేశ పురోగతికే కాకుండా సమాజంలో పలు రుగ్మతలను రూపుమాపుతుందని ప్రముఖ నాటక రచయిత కావూరి సత్యనారాయణ అన్నారు. స్థానిక బ్రాడీపేట ఎస్‌హెచ్‌ఓ హాలులో నవ్యాంధ్ర రచయితల సంఘం గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'కవిమిత్రుల కలయిక'లో భాగంగా ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనం-పుస్తక సమీక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కావూరి సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ఉన్న ప్రక్రియలు మరే ఇతర భాషలో లేవని, సమా జంలో కవికి, రచయితకు ఉన్న ప్రాధాన్యత ఎప్పటికీ అజరామరమేనని అన్నారు. ప్రముఖ రచయిత డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమ్మ భాష తెలుగు విశ్వజనీనమైనదని, తెలుగు భాషలో ఉన్న గొప్పదనం, తియ్యదనం మరేభాషలో లేదన్నారు. తెలుగులో రచనలు చేస్తున్న కవులు గర్వంగా భావించాలన్నారు. కృష్ణదేవరాయలు వంటి రాజులు కవులకు పెద్ద పీట వేశారన్నారు. మనిషి గతి తప్పుతున్నవేళ సాహిత్యమే మరలా మనిషిని మంచి మనిషిగా మార్చగలుగుతుందన్నారు. లెనిన్ శ్రీనివాస్ రచన 'కలలు చెదిరిన కళ్ళు' కవితా సంపుటిని కవి జానీబాషా సమీక్షించారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో ఉత్తమ కవిత చదివిన రేపల్లె రాజకృష్ణను నగదు, ప్రశంసాపత్రం, శాలువాతో నిర్వాహకులు సత్కరించారు. సభకు అధ్యక్షత వహించిన నవ్యాంధ్ర రచయితల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ ప్రతినెలా చివరి ఆదివారం 'కవిమిత్రుల కలయిక' కార్యక్రమం జరుపుతున్నట్లు వివరించారు. కవి సమ్మేళనంలో పింగళి భాగ్యలక్ష్మి, బండారు సురేష్ బాబు, సుభాష్ చంద్రబోస్, లెనిన్ శ్రీనివాస్, బి.సత్యనారాయణ, బి.జనార్ధనరెడ్డి, మన్నవ వెంకట గురువు, కె.విజయ్ కుమార్, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని బండికల్లు జమదగ్ని పర్యవేక్షించారు.

విశాలాంధ్ర
గుంటూరు జిల్లా

అంకిరెడ్డిపాలెంపై ప్రత్యేక దృష్టి: ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నగర శివారు గ్రామమైన అంకిరెడ్డిపాలెం అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు శాసనమండలి సభ్యులు, పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు లేళ్ళ అప్పిరెడ్డి వెల్లడించారు. అంకిరెడ్డిపాలెం గ్రామంలో స్మశానవాటిక, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటుకు సంబంధించి శరవేగంగా జరుగుతున్న పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ అన్ని వసతులతో పాటు గ్రీనరీకి కూడా అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి పూర్తి సుందరీకరణతో స్మశానవాటికను తీర్చిదిద్దాలని సూచించారు. ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ గుంటూరు నగరపాలకసంస్థతో అనుసంధానం చేసుకుని పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్యామల వెంకటరమణ బ్రహ్మారెడ్డి, ది చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ దిగుమతి సంఘం అధ్యక్షుడు లేళ్ళ పెద్ద అప్పిరెడ్డి, మాజీ అధ్యక్షుడు కుర్రి సాంబిరెడ్డి, స్థానిక నేతలు పుల్లారెడ్డి, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ, కార్పొరేషన్ ఈఈలు కొండారెడ్డి, సుందరరామిరెడ్డి, డీఈ కళ్యాణరావు, ఏఈ రవి పాల్గొన్నారు.

గర్భిణీలకు న్యూట్రిషన్ ప్రోటీన్ ఫుడ్ పంపిణీ

విశాలాంధ్ర-తాడేపల్లి : రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో రీజినల్ చైర్మన్ పబ్లిక్ ఇమేజ్ యలమంచిలి వేణుగోపాల్ జన్మదినం సందర్భంగా ఆదివారం దత్తత గ్రామమైన మెల్లంపూడి సచివాలయం వద్ద గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ ప్రోటీన్ ఫుడ్ సప్లిమెంట్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా గ్రామ వికాస్ ప్రాజెక్ట్ ఏరియా చైర్మన్ కొల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి సేవలను కొనియాడారు. దత్తత గ్రామమైన మెల్లంపూడిలో పలు రకాలుగా 14 సర్వీస్ ప్రాజెక్టులు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈసందర్భంగా వివేకానందరెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, కోశాధికారి శెట్టి రామకృష్ణ, సభ్యులు ఓబులారెడ్డి, సుకుమార్ రెడ్డి, శెట్టి కేశవరావు, రవీంద్రారెడ్డి, నాగ కిరణ్, శ్రీను, ఆర్‌సీసీ మెంబర్స్ పున్నారెడ్డి, వెంకటప్ప రెడ్డి, టి.పుష్పరాణి, షేక్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

కోవెలమూడి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ కోవెలమూడి రవీంద్ర జన్మదినాన్ని పునస్కరించుకొని కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో ప్రపంచ ప్రఖ్యాత, వైష్ణవ దేవాలయం శ్రీమహావిష్ణు స్వరూపమైన శ్రీ అనంతపద్మనాభ స్వామివారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి సుఖవాసి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. అనంతరం నాని ఫోటోల ఫ్లెకార్డ్స్ ప్రదర్శన, బర్త్‌డే కేకు కూడా దేవస్థానం ఆవరణలో కట్ చేశారు. రాష్ట్ర టీడీపీ నాయకుడు కసుకుర్తి హనుమంతరావు, రాష్ట్ర తెలుగు యువత నాయకుడు పెద్ద విక్రం, గుంటూరు అర్బన్ అధికార ప్రతినిధి చింతకాయల రామారావు, పార్లమెంట నాయకులు పులివర్తి అజార్, మిర్చి యార్డ్ మాజీ డైరెక్టర్, 18వ డివిజన్ అధ్యక్షుడు ఉప్పుతల్ల సాంబశివరావు, 19వ డివిజన్ అధ్యక్షుడు రాళ్ల బండి రామరాజు, ఆంజనేయస్వామి గుడి మాజీ చైర్మన్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మారం కిషోర్, రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి మద్దుకూరి రాంబ్రహ్మం, విద్యార్థి నాయకుడు పోసిపోగు వంశీ, మల్లెడి శంతన్, సబినేని శ్రీధర్ పాల్గొన్నారు.

ఘనంగా మాని కొమ్ముల ఆదివారం వేడుకలు

విశాలాంధ్ర-ఫిరంగిపురం: మాని కొమ్మల ఆదివారం వేడుకలు ఆదివారం ఉత్సాహంగా ఘనంగా భక్తి భావంతో పెద్ద సంఖ్యలో పాల్గొని నిర్వహించారు. బాలయేసు కథెడ్రల్ దేవాలయంలో నిర్వహించిన ఈ వేడుకకు గుంటూరు పీఠాధిపతులు రైట్.రెవ.డా.చిన్నాబత్తిని భాగ్యయ్య పాల్గొని దేవాలయ విచారణ గురువులు రెవ.డా.పామిశెట్టి బాలస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివ్యపూజా బలి కార్యక్రమాన్ని బిషప్ నిర్వహించారు. ముందుగా దేవాలయం ప్రాంగణంలో భక్తులతో కలిసి మ్రాని కొమ్ములతో దైవ సంగీత వాయిద్యాలతో జాగరణ చేశారు. అనంతరం భక్తులకు మ్రాని కొమ్ముల ఆదివారం ప్రత్యేకతను గురించి వాక్యోపదేశంచేశారు. కార్యక్రమంలో భక్తులతోపాటు దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొని సేవా కార్యక్రమాలు అందించారు.

నిబద్ధత, అంకితభావం ఎదుగుదలకు పునాదులు

విశాలాంధ్ర-తాడేపల్లి : విద్యార్థి ఏ రంగంలో రాణించాలన్నా, అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నా నిబద్ధత, అంకిత భావాలు అత్యంత ముఖ్యమని ఎంహెచ్ఎస్. డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు అన్నారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో ఆదివారం బీఏ ఐఏఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆత్రోబ్-2023 పేరిట జాతీయ యువజనోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. బీఏ విభాగ అధిపతి డాక్టర్ కేఎస్ వెంకటేశ్వరకుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో అంతర్గతంగా దాగివుండే నైపుణ్యాలను బయటకు తీసి వారిలో నాయకత్వ లక్షణాలు, కార్యనిర్వహణా సామర్థ్యాలను పెంపొందించటమే ధ్యేయంగా సాంస్కృతిక పోటీలను నిర్వహించామన్నారు. కార్యక్రమం చివరలో కేఎల్‌యూ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఉర్రూతలూగించాయి. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయికుమార్, ఆత్రోబ్ కన్వీనర్ డాక్టర్ అవినాష్ రంజన్, అధ్యాపకులు, విద్యార్థి కన్వీనర్లు తెనాలి అపూర్వ, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్‌ను పరామర్శించిన మాజీ మంత్రులు

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కౌన్సిలర్ల చేతిలో దాడికి గురైన ఆర్యవైశుడు, టీడీపీ కౌన్సిలర్ యుగంధర్‌ని మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనంద బాబు, కన్నా లక్ష్మీనారాయణలు ఆదివారం పరామర్శించారు. గొడవకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ కౌన్సిల్‌లో అధికార పార్టీ చేస్తున్న అక్రమాలపై ప్రశ్నిస్తే యుగంధర్‌పై దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రం మొత్తం వైసీపీ ఆధ్వర్యంలో దాడులు యదేచ్ఛగా షరా మామూలు అయిపోయిన పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం పర్యటన అంటే నాయకులు వసూళ్లుకు తెరలేపుతున్నారని విమర్శించారు. రాష్ట్ర సంపద సింగిల్ టెండర్ల రూపంలో తాబేదారులకు దోచి పెడుతున్నారని విమర్శించారు. నామినేషన్ పోస్టులు ఇస్తున్న మాదిరిగా సింగిల్ టెండర్లు తమ వారికి కట్టబెడుతున్నారని ఆరోపించారు. తెనాలిలో వైసీపీ నాయకులు చేసే పనులు పిల్ల చేష్టల్లాగా ఉన్నాయన్నారు. గత నాయకులు తెనాలి చరిత్రను కాపాడుకుంటూ వస్తున్నారని, వైసీపీ నాయకులు తెనాలి వాతావరణన్నీ నాశనం చేస్తున్నారని అన్నారు. వైసీపీకి సమయం దగ్గర పడిందని, ప్రజలపై దాడి చేసిన వారిని పిలిచి మరి కేసులు పెట్టడం రాష్ట్రంలో తమాషాగా మారిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు చూసైనా అధికారుల్లో మార్పు రావాలన్నారు. ప్రజలు వైసీపీని గద్దెదించటానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ముగ్గురు కౌన్సిలర్లు టీడీపీ కౌన్సిలర్‌పై దాడి చేయటాన్ని వైసీపీ ఎలా సమర్థించుకుంటుందని ప్రశ్నించారు. వైసీపీ చర్యలు గమనిస్తున్నామని, ఎన్నికలు ఎప్పుడు వచ్చిన వైసీపీ ఇంటికి పోవడం ఖాయమన్నారు. చర్యలకు ప్రతి చర్య తప్పకుండా ఉంటుందని, ఇంతకింతకు బదిలిస్తామని హెచ్చరించారు.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

పరీక్షలు బాగా రాయండి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : పరీక్షలు బాగా రాసి పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవిన విద్యార్థుల సత్తా అందరికీ తెలిసేలా ఫలితాలు రావాలన్నారు. భవిష్యత్తుల్లో ఐఐటీల్లో సీట్లు సాధించేలా చదవాలన్నారు. పాఠశాలలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు తన తరఫున ప్రత్యేక బహుమతి అందిస్తానని తెలిపారు. పరీక్షలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కంగారు పడకుండా ముందుగా పరీక్షా కేంద్రాలకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం

విశాలాంధ్ర-శావల్యాపురం: మట్టలు ఆదివారాన్ని పురస్కరించుకొని మండలంలోని బొందిలిపాలెం ఎస్సీ కాలనీలోని ఆమేన్ ప్రార్థనా మందిరంలో పాస్టర్ బుచ్చిబాబు ఆధ్వర్యంలో వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు నూతన వస్త్రాలు ధరించి, ఈతాకులతో గ్రామ పురవీధులలో ర్యాలీని నిర్వహించారు. ప్రార్థనా మందిరంలో భక్తులు ఏసుక్రీస్తుకు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఏసుక్రీస్తు గీతాలను ఆలపించారు. పాస్టర్ భక్తులకు ఏసుక్రీస్తు సందేశాన్ని వినిపించి, మట్టలు ఆదివారం ప్రాముఖ్యతను గురించి వివరించారు. చర్చి కమిటీ సభ్యులు భక్తులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

రెంటచింతల: రెంటచింతల, తుమ్మకోటతోపాటు అన్ని గ్రామాల లూథరన్, ఆర్సీఎం చర్చిలలో మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక కానుకమాత చర్చి విచారణ గురువు వైఎల్ మర్రెడ్డి, తుమ్మకోట లూథరన్ చర్చి పాస్టరు యోహాను పర్యవేక్షణలో విశ్వాసులు మట్టలు చేతబట్టి వీధులలో ఏసుప్రభును కొనియాడుతూ ప్రచారం చేశారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుప్రభువు జెరుసలేం ప్రవేశించిన సందర్భంగా చేసిన ఉత్సవాలు కావటంతో చర్చిలు విశ్వాసులతో నిండాయి.

వినుకొండ: ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్టు చర్చి వారి సండే స్కూల్ పిల్లల ఆధ్వర్యంలో మట్టల ఆదివారము యేసుక్రీస్తు ప్రభువు యెరూషలేము లోనికి జయ ప్రవేశము చేస్తూ గాడిదపిల్ల ఎక్కి వెళ్ళిన సందర్భాన్ని జ్ఞాపకం చేసుకుంటూ పాటలు పాడుకుంటూ ర్యాలీ చేసారు. ఈ కార్యక్రమంలో రెవ. పత్రా ఫిలిప్ ప్రార్థన చేసి ప్రారంభించారు. సంఘ అధ్యక్షులు పందుల, సాల్మన్ రాజు, సంఘ వైస్ సెక్రటరీ కట్టింపూడి. నాగేశ్వరరావు, సంఘ వైస్ ప్రెసిడెంట్ శిఖా ఆనందరావు, సంఘ ట్రెజరర్ పాలెపోగు. దానియేల్, కమిటి సభ్యులు మగిరాజు, వరప్రసాద్, సండే స్కూల్ సూపరిటెండెంట్ గొల్లపల్లి, మేరిరత్నం, సండే స్కూల్ టీచర్ ఉషాకిరణ్, యూత్ సభ్యులు మహేష్, ప్రశాంత్, జూలియా వర్షధార, దీపక్, నవ్య, చిన్నారులు పాల్గొన్నారు.

నిస్సహాయులపై వాత్సల్యం

విశాలాంధ్ర-శావల్యాపురం: తల్లిదండ్రులు లేని ఎలాంటి ఆధారం లేకుండా ఒంటరిగా ఉంటున్న 18 సంవత్సరాలలోపు బాల బాలికల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మిషన్ వాత్సల్య ప్రోగ్రామ్‌కు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని సిడిపివో ముదివర్తి అనురాధ ఆదివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరముల లోపు రక్షణ లేదా సంరక్షణ అవసరమైన పిల్లల కుటుంబాలు పిల్లలకు ఆర్థిక లేదా ఇతరత్రా అనగా పిల్లల వైద్య, విద్య, అభివృద్ధి అవసరాలను తీర్చడానికి అనుబంధ మద్దతును అందించడం కోసం కేంద్ర ప్రాయోజిత పథకం మిషన్ వాత్సల్య క్రింద స్పాన్సర్‌షిప్ ఇది షరతులతో కూడిన సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ స్పాన్సర్‌షిప్ ద్వారా పిల్లలకి నెలకు ఒక్కొకరికి రూ.4000లు అందించడం జరుగుతుంది. స్పాన్సర్‌షిప్ పొందుటకు పిల్లలకు కావలసిన అర్హతలు తల్లి వితంతువు లేదా విడాకులు తీసుకున్న లేదా కుటుంబం విడిచిపెట్టిన పిల్లలు, పిల్లలు అనాథలుగా ఉండి ఇతర కుటుంబ సభ్యులతో కలసి జీవిస్తువున్నవారు. తల్లిదండ్రులు ప్రాణాపాయ/ప్రాణాంతక వ్యాధికి గురైన వారు, తల్లిదండ్రులు ఆర్థికంగా మరియు శారీరకంగా అసమర్థులు అయివుండి పిల్లలను చూసుకోలేని వారు, జెజె యాక్టు 2015 ప్రకారం రక్షణ, సంరక్షణ అవసరమైన పిల్లలు అనగా, కుటుంబంతో లేని పిల్లలు, ఏదైనా ప్రకృతి వైపరీత్యానికి గురైన పిల్లలు, బాల కార్మికులు, అంగవైకల్యం కలిగిన పిల్లలు, మిస్సింగ్, ఇంటినుంచి పారిపోయి వచ్చిన పిల్లలు, బాల యాచకులు లేదా వీధులలో నివసిస్తున్నటువంటి పిల్లలు, సహాయం, పునరావాసం అవసరమయ్యే హింసకు గురైన లేదా దుర్వినియోగం చేయబడిన లేదా దోపిడీకి గురైన పిల్లలు, కరొనా వలన తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకోనుటకు జననధృవీకరణ పత్రము, ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, మరణ ధ్రువీకరణ పత్రము, మరణానికి గల కారణము, కుల ధ్రువీకరణ పత్రము, ఫోటో, స్టడీ సర్టిఫికేట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్ వివరాలతో ఐసిడిఎస్ వినుకొండ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ కుమ్మరి బజార్‌కు చెందిన పూసపాటి తేజ ప్రైవేట్ టీచర్, ఇందిరా నగర్‌కు చెందిన షేక్ బీబీ జాన్‌లు ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. గత నెల 27వ తేదీన నిర్వహించిన ఇంటర్ నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థ నిర్వహించిన పరీక్షలలో తేజ ఫ్రూట్స్ పై వ్రాసినందుకు మరియు బీబీ జాన్ కురగాయలపై రాసినందుకు ఆంధ్రప్రదేశ్ మొత్తం మీద నలుగురి ఇంటర్నేషనల్ వర్ల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కించుకోగా అందులో వినుకొండకు చెందిన ఇరువురు అవార్డులు పొందారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు వారిని అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అదజేశారు. ఈ సందర్భముగా జి.వి. మాట్లాడుతూ మన వినుకొండకి ఇలాంటి అవార్డులు సాధించటం తనకు చాలా గర్వకారణంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు పి.వి.సురేష్ బాబు, టిడిపి నాయకులు శమీమ్ ఖాన్, సౌదాగర్ జానీ భాష, అయుబ్ ఖాన్,యూత్ జానీ, అకుమల్ల ఖాసీం, రియల్ ఎస్టేట్ జానీ,ఫరూక్, షకీర్ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండలంలోని 75 తాళ్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ పరీక్షా కేంద్రాలలో మొత్తం 720 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని ఎంఈఓ ఏకుల ప్రసాదరావు తెలిపారు.

తాగునీరు వాగు పాలు

విశాలాంధ్ర-పెదకూరపాడు : స్థానిక కాలచక్ర రోడ్‌లో పేరమ్మ వాగు దగ్గర గ్రామపంచాయతీ ద్వారా సరఫరా చేసే త్రాగునీరు పైపు లీక్ అయ్యి నీరు అన్నీ వాగులో కలుస్తున్నాయని, లీకును సరిచేసి త్రాగునీరు అందరికీ అందే విధముగా సరఫరా చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఉరుములతో వాన.. రైతుల ఆందోళన

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం సాయంకాలం ఉరుములు మెరుపులతో, ఈదురుగాలులతో వర్షం కురిసింది, రైతులు మిర్చి పంటను కోసి కల్లాలలో ఆరబోశారు. ఈదుర గాలులతో కూడిన వర్షంలో మిరప కాయలు తడిసిపోతాయని వాటిని కాపాడుకునేందుకు పరుగులు తీశారు. ఉరుములు రావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.

ప్రజా చైతన్య ప్రచార యాత్రలు జయప్రదం చేయాలి

జిల్లా సీపీఐ, సీపీఎం కార్యదర్శులు మారుతి, విజయ్ కుమార్

విశాలాంధ్ర-నరసరావుపేట: వామపక్షాల ఆధ్వర్యంలో ఈ నెల 14 నుండి 30 వరకు మోడీ హటావో దేశ్ కి బచావో నినాదంతో జిల్లావ్యాప్తంగా చేపడుతున్న ప్రజా చైతన్య ప్రచార యాత్రలు జయప్రదం చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్ని వర్గాల ప్రజలకు పిలుపునిచ్చారు. నరసరావుపేటలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఉభయ కమ్యూనిస్టు పార్టీల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న ప్రమాదకర మతోన్మాద విధానాల పట్ల ప్రజలను అప్రమత్తం చేసేందుకు, మోడీ హటావో దేశ్‌కో బచావో నినాదం పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ అడుగు లకు మడుగులోత్తని రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తం దారి విధానాలపైన నియంతృత్వ పోకడలపై నిరసిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రాజ్యాంగాన్ని పరిరక్షించం లని ప్రతిపక్ష పార్టీలపై ఆయా రాష్ట్రాల నాయకత్వంపై సిబిఐ, ఈడీలతో తప్పుడు కేసులు బనాయించి అరాచక విధానాలు అవలంబించడాన్ని, పార్లమెంట్లో కేంద్ర ప్రభు త్వాన్ని నిలదీసే సభ్యులపై, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై తప్పుడు కేసులు బనాయించి పార్లమెంటు సభ్యత్వానికి కూడా అనార్హుడుగా ప్రకటించడాన్ని నిరసిస్తూ దేశంలో దళిత, మైనార్టీ వర్గాలపైన జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ ఈ ప్రచార యాత్ర జరుగుతుందని వారన్నారు. రాష్ట్రంలో కూడా ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అరాచక పాలనకు అంతం పలకాలని రాష్ట్ర రాజధానిగా అమరావతినినే కొనసాగించాలని, రాష్ట్రంలో ఉన్న ఏకైక భారీ పరిశ్రమ విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాలని, పోలవరం ప్రాజెక్టును వెంటనే యుద్ధప్రాతిపదికన నిర్మించాలని దానికి తగిన నిధులను వెంటనే కేంద్రం విడుదల చేయాలని నిర్వాసితులకు తక్షణమే నష్టపరిహారాన్ని విడుదల చేసి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 14వ తేదీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఏప్రిల్ 30వ తేదీ వరకు పల్నాడు జిల్లాలోని ఏడు నియోజ కవర్గ కేంద్రాలలో సిపిఐ సిపిఎం వామపక్షాలు నిర్వహించే ఈ ప్రచార పాదయాత్రలను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు బూదాల శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, రోడ్డా అంజిరెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి, షేక్ సిలార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పర్యటన విజయవంతం చేయాలి: మంత్రి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ప్రజలకు ఏం కావాలో, వారి అవసరాలు ఎలా తీర్చాలో జగనన్నకు బాగా తెలుసని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఈ నెల ఆరో తేదీన చిలకలూరిపేట రూరల్ మండలం లింగంగుంట్ల గ్రామానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వస్తున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను ఆదివారం మంత్రి విడదల రజిని పర్యవేక్షించారు. తొలుత సభా ప్రాంగణాన్ని సందర్శించారు. అక్కడ తీసుకుంటున్న చర్యలపై అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అక్కడి నుంచి హెలీప్యాడ్ ప్రాంతానికి చేరుకున్నారు. అధికారుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ నరసరావుపేట, చిలకలూరిపేట, పోతవరం నాదెండ్ల, అప్పాపురం నుంచి లింగంగుంట్లకు వచ్చే అన్ని రహదారుల్లో ప్రత్యేకంగా పార్కింగ్ ప్రాంతా లను ఏర్పాటుచేయాలని చెప్పారు. ఎటువైపు వాహనాలను అటువైపే ఆపుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

వైద్య ఆరోగ్య రంగంలో సరికొత్త విప్లవం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య ఆరోగ్య రంగం విషయంలో తొలి నుంచి ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని మంత్రి విడదల రజిని తెలిపారు. ఆరోగ్యశ్రీ ప్రొసీజర్లు పెంచడం, ఊరూరా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు అందుబాటులోకి తీసుకురావడం, దాదాపు 50 వేల మంది సిబ్బంది నియామకాలు చేపట్టం, కొత్త ఆస్పత్రులు, నూతన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను అందుబాటులోకి తీసుకురావడం... ఇలా ఎన్నో విప్లవాత్మక మార్పులను జగనన్న వైద్య ఆరోగ్య రంగంలో తీసుకొచ్చారని కొనియాడారు. ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని నూతనం ప్రారంభిస్తున్నారని పేర్కొన్నారు. ఇది వైద్య ఆరోగ్య రంగంలో సరికొత్త మార్పునకు నాంది పలుకుతుందని చెప్పారు. పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తి జగన్

విశాలాంధ్ర-రొంపిచర్ల : ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే వ్యక్తి ముఖ్యమంత్రి జగన్ అని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం వైఎస్సార్ ఆసరా మూడవ విడత పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు డ్వాక్రా మహిళలకు ఇవ్వవలసిన బకాయిలు చెల్లిస్తానని సీఎం జగన్ మాట ఇచ్చారని. ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళలకు మూడు విడతలలో రూ.19 వేల కోట్లు జమ చేశారని అన్నారు. మిగిలిన రూ.6 వేల కోట్లు వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో జమ చేస్తారని అన్నారు. మూడవ విడతలో రాష్ట్రంలో ఉన్న 78 లక్షల డ్వాక్రా గ్రూపులకు రూ.6 వేల కోట్లకుపైగా నగదు ఇవ్వటం జరిగిందని అన్నారు. చంద్రబాబు నాయుడు 2014 ఎన్నికలకు ముందు రైతుల రుణమాఫీ, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని చెప్పి మాట తప్పారని అన్నారు. విలువలకు, విశ్వసనీయతకు కట్టుబడి ఉండే వ్యక్తి అండగా ఉంటారా, వెన్నుపోటుదార్లకు అండగా ఉంటారా అని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు వైసీపీ ఎమ్మెల్యేలు నలుగురిని ఒక్కొక్కరికి రూ.10 కోట్ల కొనుగోలు చేసి గెలుపొందారని అన్నారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండలంలో 1100 డ్వాక్రా గ్రూపులకు రూ.9 కోట్లకు పైగా వైఎస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిల్లి ఓబుల్ రెడ్డి, ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ, మార్కెట్ యార్డు ఛైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, ఎండీఓ కె.మ్యాథ్యూబాబు, గ్రామ సర్పంచ్ తిప్పగుడిశ జయమ్మ, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గెల్లి సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ గెల్లి చినకోటిరెడ్డి, పల్నాడు జిల్లా వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు పడాల శివారెడ్డి, వైసీపీ మండల నాయకులు మేడికొండ శ్రీనివాసరెడ్డి, చపారపు సంజీవరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, గానుగపంట ఉత్తమరెడ్డి, కురుగంటి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు సముచిత స్థానం కల్పించాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బీసీ కుల గణన చేపట్టాలని, యాదవులకు చట్టసభల్లో సముచిత స్థానం ఇవ్వాలని అఖిలభారత యాదవ మహా సంఘం జాతీయ అధ్యక్షుడు ముసగాని లక్ష్మయ్య యాదవ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సంఘ జాతీయ సెక్రటరీ జనరల్ మద్దుల వెంకటకోటయ్య యాదవ్ నివాస ప్రాంగంలో ఆదివారం ఏపీ కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎం.లక్ష్మణయాదవ్ మాట్లాడుతూ తమిళనాడు, బీదర్ ప్రాంతాలలో ఇప్పటికే కుల గణన చేపట్టిన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గమనించాలని సూచించారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నా రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదన్నారు. రాజకీయాలకు అతీతంగా యాదవులు తమ హక్కుల సాధనకు ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు యాదవులను ఓటు బ్యాంకుగానే పరిగణిస్తున్నాయని, వారికి రానున్న ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో యాదవులకు సీట్లు కేటాయించిన చోట వారి గెలుపు కోసం, లేదా బీసీలకు సీట్లు కేటాయించిన ప్రాంతాలలో యాదవులు మద్దతుగా నిలచి వారి గెలుపు కోసం కృషి చేస్తారని, యాదవ మహాసంఘం సైతం వారికి బాసటాగా నిలుస్తుందన్నారు. సమావేశంలో అఖిల భారతయాదవ మహాసంఘం జాతీయ సెక్రటరీ జనరల్ మద్దుల వెంకటకోటయ్య యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటూరి పేరయ్య, నాయకులు పి.లక్ష్మీప్రసాద్ యాదవ్, కె.శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

కళ్యాణ మండపం నిర్మాణం అభినందనీయం.

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ ప్రాంత ప్రజల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా పిలవబడుతున్న శ్రీ మదమంచిపాటి ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టడం ఎంతో అభినందనీయమని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ. ఆంజనేయులు అన్నారు. కళ్యాణ మండపం నిర్మాణానికి గతంలో ప్రకటించిన 10 లక్షల 50 వేల,నుట పదహారు విరాళంలో ఆదివారం తన నివాసం నందు కొంత నగదు నీ కమిటీ సభ్యులకు ? 6.50 లక్షలు అందజేశారు. కళ్యాణ మండపం నిర్మాణం చేపడుతున్న కమిటీ సభ్యులను ఆయన ఘనంగా సన్మానించారు. సందర్భంగా జీ.వి ఆంజనేయులు మాట్లాడుతూ దేవాలయం వద్ద కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టడం వలన ఎంతోమంది వివాహాలు, శుభకార్యాలు నిర్వహించుకునేందుకు ఉపయోగంగా ఉంటుందన్నారు. వినుకొండ ప్రాంత ప్రజలను దృష్టిలో ఉంచుకొని దేవాలయం వద్ద కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టడం ఎంతో సంతోషకరమన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, ప్రతి ఏటా ఆలయ కమిటీ పెద్దలు రాష్ట్రస్థాయి ఎడ్ల పందాలు నిర్వహించడం అందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. ఏడాది కూడా నిర్వహించే ఎడ్ల పందాలకు తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు అభివృద్ధిలో తన వంతు భాగస్వామ్యం తప్పక ఉంటుందన్నారు. భవిష్యత్తులో మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మరియు నూజెండ్ల మండల టిడిపి అధ్యక్షుడు మీసాల మురళీ యాదవ్ టిడిపి సీనియర్ నాయకులు వంకాయలపాటి పేరయ్య, మదమంచి పాటి వీరాంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ జక్కిరెడ్డి సుబ్బారెడ్డి కుంట కోటిరెడ్డి, అనుముల సుబ్బారెడ్డి, మక్కెన వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలన అందిస్తున్నాం..

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : ప్రజలకు అవినీతి లేని పారదర్శక పాలన అందిస్తున్నామని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. మండల కేంద్రమైన అచ్చంపేటలో ఆదివారం 1, 2 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి తమ ప్రభుత్వ హయాంలో మూడేళ్లలో అందిన సంక్షేమం, చేసిన అభివృద్ధి గురించి వివరించారు. సంక్షేమ వివరాలతో కూడిన కరపత్రాలు అందించారు. గ్రామంలో ఏవైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. స్థానికులు సూచించిన సమస్యలను అక్కడికక్కడే అధికారులతో చర్చించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడేళ్లలో అన్ని వర్గాలకు సంక్షేమం అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. తాము చేసిన దాంట్లో కనీసం పది శాతమైనా గత ప్రభుత్వంలో చేశారా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వ పాలనలో అందిన సంక్షేమం, జరిగిన అభివృద్ధి ప్రజలు గమనించాలని కోరారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు విరబూస్తున్నాయన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్ నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలను పేదల ముంగిటకే తెచ్చారన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలు అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట మండల జడ్పీటీసీ సభ్యులు తుమ్మ విజయప్రతాపరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ చిలకా చంద్రయ్య, సర్పంచి కంబాల వీరబాబు, నెల్లూరు చంద్రబాబు, అంబటి నారాయణ, సాయి రెడ్డి, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

విశాలాంధ్ర-శావల్యాపురం : పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి మద్దికుంట సాంబశివరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఐదు జడ్పి పాఠశాలల నుండి 267 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రం నుండి 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎగ్జామ్స్ జరిగే సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని నిర్వాహకులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు ప్రయాణించడానికి ఆర్టీసీ వారు రెండు బస్సులు ఏర్పాటు చేశారని, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే తీర్మానాన్ని రద్దు చేయాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్ రెడ్డి వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయటం అన్యాయమని గిరిజన సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఎన్ఆర్‌టీ సెంటర్‌లోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నుంచి మొదలుకొని కళామందిర్ సెంటర్, అడ్డరోడ్ సెంటర్ మీదుగా స్థానిక వైసీపీ కార్యాలయం వరకు మహా నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సామాజిక వర్గానికి జరిగిన అన్యాయంపై సీఎం జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా కళామందిర్ సెంటర్లో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షులు జె.రాంబాబు, నంగాగారభేరి సేవలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు రమావతు కృష్ణా నాయక్ మాట్లాడుతూ తమ ఎస్టీ జాబితాలో వాల్మీకి, బోయలను చేర్చడం వలన రిజర్వేషన్ పరంగా పలు ఇబ్బందులు ఎదుర్కొంటామని, అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుగాలి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బి.శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక నాయకత్వం కావాలి: చిట్టా

విశాలాంధ్ర-సత్తెనపల్లి : ఏదో స్టేజి మీద నాలుగు మాటలు మాట్లాడి పది మంది పోలీసులను వెంటేసుకుని తిరిగితేనే నాయకుడు కాదు, ప్రజలకు దగ్గరవ్వాలి, ప్రజల్లో ఉండాలని మాజీ గ్రంథాలయ ఛైర్మన్, వైసీపీ నేత చిట్టా విజయభాస్కర రెడ్డి అన్నారు. స్థానికంగా ఉన్న నాయకుడు కార్యకర్తలను పలకరించటం లేదు... ఆదరణ చూపటం లేదు.. పార్టీ శ్రేణులు నిరాశలో ఉన్నారు.. ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలందరూ ప్రత్యామ్నాయం కోరుకుంటున్నారని, నియోజకవర్గంలో పార్టీకి బీటలు వారుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నాయకత్వం మరాల్సిన అవసరం ఉందని అన్నారు. నేను నిర్మించిన పునాదులను నా ప్రాణాలు అడ్డుపెట్టైనా కాపాడుకుంటాను... అని చిట్టా విజయ భాస్కర రెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం చిట్టా ఆధ్వర్యంలో పట్టణంలో నరసరావుపేట రోడ్డులోని తన అపార్ట్‌మెంట్ ఆవరణలో వైఎస్సార్ అభిమానుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయవాది, వైసీపీ నేత అంకాళ్ళ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముందుగా నాయకులు వైఎస్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిట్టా మాట్లాడుతూ 34 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా.. 1995లో ఫిరంగిపురం కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయాను. 99 ఎన్నికల్లో రాజశేఖర రెడ్డి సత్తెనపల్లి అసెంబ్లీ స్థానానికి పోటీ చేయడానికి దరఖాస్తు చేసుకోమన్నారు. అప్పటి ఆర్థిక పరిస్థితులు సహకరించక ఆ ఆఫర్ తిరస్కరించాను. 2004లో టికెట్ అడిగాను. ఆఖరి నిమిషం వరకు నాకే సీట్ వస్తుందని భావించాను. కానీ యర్రం వెంకటేశ్వర రెడ్డి సీటు దక్కించుకున్నారన్నారు. తరువాత జిల్లా గ్రంథాలయ ఛైర్మన్‌గా పనిచేశానన్నారు. ఆత్మీయ సమావేశానికి వెళ్తే బాగోదని హెచ్చరికలు జారీ చేశారని, సమావేశం ముగిసిన తర్వాత ఎవరైనా బెదిరింపులకు గురి చేస్తే తాను రోడ్డెక్కుతానన్నారు. నెల రోజుల్లో పార్టీ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి జూన్ ఒకటి నుంచి గ్రామాల్లో జోలె పట్టుకుని ఇంటింటికి తిరుగుతానని స్పష్టం చేశారు. కోటనెమలిపురి ఎంపీటీసీ అంజిరెడ్డి, బొల్లారం సర్పంచ్ బద్దిగం వెంకటరెడ్డి, నాగేశ్వరరావు, ధర్మారెడ్డి, బాజి, పాపిరెడ్డి, భద్రారెడ్డి, దేవిరెడ్డి రమణా రెడ్డి, రాంబాబు, వెంకటరామిరెడ్డి, వీరంజనేయులు, కోటిరెడ్డి, నాగేశ్వరరావు, నాగుర్, రెడ్డిగూడెం బుడే, సువర్ణరాజు, సుభాని, జానీ తదితరులు పాల్గొన్నారు.

వివాదాలకు తావు లేకుండా ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించే ఏకీకృత సర్వీస్ రూల్స్ సమగ్రంగా వివాదాలకు తావులేకుండా రూపొందించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు కోరారు. ఆదివారం పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్, సీనియారిటీ లిస్ట్ సభార్డి నేట్ సర్వీస్ రూల్స్ 1996 అనుగుణంగా మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో తయారు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు అర్బన్ ఇన్‌స్పెక్షన్ అధికారాలు కల్పించే పోస్ట్ ఇవ్వాలని, మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపాలిటీలకు ఏకీకృత సర్వీస్ రూల్స్‌లో బదిలీలు పదోన్నతుల్లో జిల్లా మొత్తం యూనిట్‌గా అవకాశం ఉండాలన్నారు. జిల్లా స్థాయి రాష్ట్ర స్థాయి విద్యాధికారుల పోస్టులు మంజూరు చేసి మున్సిపల్ ఉపాధ్యాయుల్లో సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ విద్యావ్యవస్థను కాపాడాలని, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు డ్రాయింగ్ డిస్బర్స్‌మెంట్ అధికారిగా మున్సిపల్ హెడ్‌మాస్టర్ నియమించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, పట్టణ అధ్యక్షుడు మేకల కోటేశ్వరరావు, కార్యదర్శి షేక్ జామీర్ బాషా, అంకమ్మరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

పట్టణ తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షునిగా చెన్నయ్య

విశాలాంధ్ర-మాచర్ల: పట్టణ తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షునిగా గాజుల చెన్నయ్య ఎన్నికయ్యారు. ఆదివారం సిపిఐ కార్యాలయంలో జరిగిన ఎన్నికలో నాయకులు బత్తిన వెంకటేశ్వర్లు అధికారిక పత్రాన్ని అందజేశారు. గాజులు చెన్నయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు ఓటు వేసి సహకరించిన కార్మికులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నిత్యం కార్మికులకు తోడుగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎప్పటిలాగే కార్మికులకు ప్రభుత్వ పథకాలతో పాటు, కొన్ని ప్రత్యేక పథకాలను కొనసాగిస్తామన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను కార్మికులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తన ప్రత్యర్థి ఎస్ఎండి భాషాపై 40 ఓట్లు మెజారిటీ సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం చెన్నయ్యను కార్మికులు, నాయకులు ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మిద్దెపోగు బాబురావు, పగడాల సుధాకర్, కొమెర పెద్ద శ్రీను, మహంకాళి కొండలు, తిమ్మరాజు, ఉప్పుతోళ్ల చిన్న దుర్గారావు రాజారావు అంజి రామదాసు, గొడుగు వెంకటేశ్వర్లు, ముత్యాలు, ఏసుబాబు, పుల్లారావు, వెంకటేశ్వర్లు, షేక్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లికి ఘన నివాళి

విశాలాంధ్ర-యడ్లపాడు : పుచ్చలపల్లి సుందరయ్య 20వ నాటకోత్సవాల సందర్భంగా ఏప్రిల్ 1వ తేదీ రాత్రి నిర్వహించిన రెండవ రోజు కార్యక్రమంలో పుచ్చలపల్లి సుందరయ్యకు పలువురు నివాళులర్పించారు. యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళా ప్రాంగణంలో గల ఎంవి చౌదరి కళావేదికపై జరుగుతున్న సుందరయ్య నాటకోత్సవాల సందర్భంగా నిర్వాహకులు ముత్తవరపు సురేష్ బాబు, నూతలపాటి కాళిదాసు, ముత్తవరపు సీతారామయ్య, జరుగుల శంకరరావు తదితరులు మాట్లాడుతూ సుందరయ్య జీవిత విశేషాలు వివరించారు. అనంతరం విజయవాడ వారి కపిరాజు, కట్రపాడు వారి ప్రక్షాళన, తాడేపల్లివారి వెండి అంచులు నాటికలు ప్రదర్శించారు.

సత్తెనపల్లిలోనే ఉంటా: అంబటి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : తన ప్రాణం ఉన్నంత వరకు సత్తెనపల్లిలోనే ఉంటానని ఏపీ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ఆదివారం సత్తెనపల్లిలో వైరి వర్గం ఇవాళ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడంపై అంబటి రాంబాబు స్పందించారు. సత్తెనపల్లిలో పోటీ చేయాలని పార్టీ నాయకత్వం సూచించడంతో తాను ఇక్కడికి వచ్చినట్టుగా అంబటి రాంబాబు గుర్తుచేశారు. టిక్కెట్టు విషయంలో సీఎం జగన్‌దే తుది నిర్ణయమన్నారు. ఈ విషయంలో జగన్ నిర్ణయాన్ని తాను శిరసావహిస్తానన్నారు. సత్తెనపల్లిలో తనను పోటీ చేయవద్దని జగన్ కోరితే తాను పోటీకి దూరంగా ఉంటానన్నారు. జగన్ నిర్ణయానికి వ్యతిరేకంగా తాను వ్యవహరించబోనని ఆయన స్పష్టం చేశారు. సత్తెనపల్లిని తన ప్రాంతంగా నిర్ణయించుకున్నట్టుగా ఆయన చెప్పారు. ఎన్నికల సమయంలో సీట్ల కోసం ఎవరైనా పోటీ పడవచ్చన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇలాంటివి సహజమని ఆయన అభిప్రాయపడ్డారు. అసంతృప్తుల వ్యవహారం పార్టీ నాయకత్వం చూసుకుంటుందని అంబటి రాంబాబు చెప్పారు.

పిడుగుపాటుకు అన్నదాత మృతి

విశాలాంధ్ర-పెదకూరపాడు : అకాల వర్షం నేపథ్యంలో పంటను రక్షించుకోవడానికి వెళ్లి పిడుగుపాటుకు గురై అన్నదాత మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం పెదకూరపాడు గ్రామానికి చెందిన ఏనుగుల నరసింహారావు(45) ఆదివారం ఈదురుగాలితో కూడిన అకాల వర్షంతో మిర్చి కళ్ళంలో ఆరబెట్టిన మిరప పంటపై పట్టకప్పేందుకు వెళ్లి పిడుగుపాటుకు గురై మృతి చెందారు. అప్పటివరకు ఇంట్లో ఉండి కొద్దిసేపట్లో మృత్యువాత పడ్డ నరసింహారావును చూసి కుటుంబీకులు, గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు.

మహారాజశ్రీ గురజాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి.38/2019 ఇన్ ఓ.ఎస్. 435/14

బిట్వీన్

త్రిపురమల్లు మంగమ్మ, భర్త లక్ష్మికాంతం, పిడుగురాళ్ళ - డి.హెచ్.ఆర్.

మరియు

నాగసరపు లక్ష్మి, భర్త లేటు దుర్గా శంకరరావు, పిడుగురాళ్ళ. - జె.డి.ఆర్.

పై నెంబరు అమలులో ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని పై కోర్టువారిచే **డి. 26-4-2023న ఉదయం గం.10.30లకు** వేలం వేయబడును. వేలం పాటలో పాల్గొనదలచిన వారు పై కోర్టువారి ఎదుట పైన తెలిపిన సమయమునకు హాజరై వేలములో పాల్గొన కోరుచున్నాము.

షెడ్యూలు : గుంటూరు జిల్లా ప్రస్తుతము పలనాడు జిల్లా నరసరావుపేట రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్టు, పిడుగురాళ్ళ టౌన్, మరియు నగర పంచాయతీ ఆర్‌సిసి కప్పుగల నివాస గృహము డోర్ నెం. 9-165, ప్రస్తుత డోర్ నెం. 9-166, పిడుగురాళ్ళ గ్రామ డి. నెం. 163/1, విస్తీర్ణం యం. 2 1/2 సెంట్లుకు **హద్దులు : తూర్పు** : యర్రం శేఖర్ గృహము, **దక్షిణం** : చిట్టిప్రోలు శ్రీనివాసరావు గృహము, **పడమర** : రైల్వేస్టేషన్ రోడ్డు, **ఉత్తరం** : నల్లబోతుల నరసింహారావు గృహము.

డి.హెచ్.ఆర్. విలువ : రూ.5,00,000/-

అమీనా విలువ : రూ. 10,00,000/-

ఇ.సి. దాఖలా అన్యక్రాంతములు లేవు.

వేలం వాయిదా : 26-4-2023

(By order of the Court)

డి.ఎ. చంద్రశేఖరరావు, బి.ఎ., ఎల్.ఎల్.బి.
డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది,
గురజాల, పిడుగురాళ్ళ,
తేది : 21-3-2023 సెల్ : 9652250060

ఉద్యమాల స్థావరం.. విశాలాంధ్ర కార్యాలయం

- ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు
- బాపట్లలో విశాలాంధ్ర జిల్లా కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : ఉద్యమాల స్థావరం విశాలాంధ్ర కార్యాలయమని విశాలాంధ్ర జాతీయ దినపత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు తెలిపారు. బాపట్ల జిల్లా కేంద్రంలోని శృంగారపురంలో ఆదివారం విశాలాంధ్ర జిల్లా కార్యాలయాన్ని న్యూస్ ఎడిటర్ ఎం.మురళీకృష్ణ, బ్యూరో చీఫ్ చావా రవిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కూన అజయ్‌బాబు మాట్లాడుతూ విశాలాంధ్ర పత్రికకు 70 ఏళ్ల ఘన చరిత్ర ఉందన్నారు. రాష్ట్రంలో ఎన్నో దినపత్రికలు ఉన్నప్పటికి విశాలాంధ్రకు మరేది సాటిరాదన్నారు. కార్పొరేట్ పత్రికలకు దీటుగా భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆధ్వర్యంలో విశాలాంధ్ర విజ్ఞాన సమితి సొసైటీతో నడుస్తున్న విశాలాంధ్ర దినపత్రిక, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విశాలాంధ్ర బుక్ హౌస్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విశాలాంధ్ర అంటే కేవలం పత్రిక మాత్రమే కాదని ప్రజా ఉద్యమాలకు వేదిక అన్నారు. రాష్ట్ర సాంస్కృతిక పునరుజ్జీవనానికి సాహిత్యాభివృద్ధికి కృషి చేసే పత్రిక అన్నారు. గత 70 ఏళ్లుగా పత్రికా రంగంలో ఏలాంటి పోరాట పటిమ కనపరిచామో ఇకపై కూడా రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తామని పాఠకులకు భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పడిన అనంతరం తాము కూడా ప్రతి జిల్లాలో జిల్లా కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దానిలో భాగంగానే నేడు జిల్లా కేంద్రమైన బాపట్లలో జిల్లా కేంద్రాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. కేవలం వార్తల సేకరణ కోసమే కాకుండా జర్నలిస్టుల అభ్యున్నతి కోసం జర్నలిస్టు యూనియన్ కార్యకలాపాలకు ఊతమిస్తామన్నారు. స్థానికంగా కార్యాలయాన్ని నెలకొల్పేందుకు సహకరించిన సీపీఐ జిల్లా శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు కోన రఘుపతి తన తండ్రి కోన ప్రభాకరరావుకు విశాలాంధ్ర దినపత్రిక అంటే ఇష్టం అన్నారు. నాటి నేటి వరకు ప్రజాక్షేత్రంలో వెనుకంజ లేకుండా వార్తలు ప్రచురిస్తున్న విశాలాంధ్ర యాజమాన్యానికి ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు. పత్రికాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తాను బాపట్లలో లేకపోవటం వల్ల కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరు కాలేదని బాపట్ల వచ్చిన తరువాత కార్యాలయాన్ని సందర్శిస్తానని తెలిపారు. రాష్ట్ర మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి ఆయన తనయుడు గాదె మధుసూదనరెడ్డి నూతనంగా ప్రారంభించిన విశాలాంధ్ర కార్యాలయానికి శుభాకాంక్షలు తెలిపారు. నీతినిజాయితీ కల్గిన వార్తలతో పత్రికారంగంలో తమదైన ముద్ర వేసుకున్నారని అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను కళ్లకు కట్టినట్లుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటానికి విశాలాంధ్ర లాంటి దినపత్రికలు సమాజానికి ఎంతో అవసరం అన్నారు. అక్కడ సీపీఐతో పాటు విశాలాంధ్ర ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబు చరవాణి ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు కూడా పత్రికను మరింతగా ఆదరించాలని కోరారు. కర్లపాలెం ఎంపీపీ యారం వనజ మాట్లాడుతూ అధికార పార్టీ అయిన ప్రతిపక్ష పార్టీ అయిన తప్పును తప్పుగా ఎత్తి చూపే ఏకైక పత్రిక విశాలాంధ్ర అని కొనియాడారు. జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి నామన వెంకటశివన్నారాయణ మాట్లాడుతూ జనసేన పార్టీ తరుపున పత్రిక అభ్యున్నతికి కృషిచేస్తామన్నారు. బహుజన నీతి నిజాయితీలతో కూడిన వార్తలు ప్రచురించటంలో విశాలాంధ్ర తనకు తానే సాటి అని యాజమాన్యాన్ని అభినందించారు. భవిష్యత్తులో ఈ పత్రిక మరింత ప్రజాభిమానం చూరగొనాలని ఆకాంక్షించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ కులమతాలు ప్రాంతాలకు అతీతంగా, బడుగు పేద ప్రజలకు బంధువుగా నిలిచే పత్రిక విశాలాంధ్ర అన్నారు. సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగితే సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు మాట్లాడుతూ విశాలాంధ్ర లాంటి దినపత్రికలు లేకపోతే పేద వారి గొంతుక మూగబోయినట్లే అన్నారు. కార్పొరేట్ కబంధ హస్తాల నుంచి సామాన్య ప్రజలకు విముక్తి కల్పించాలంటే ఇలాంటి దినపత్రిక ఇంటింటికి చేరాలన్నారు. అంటరానితన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ జి.చార్వాక మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు దగ్గరగా విశాలాంధ్ర దినపత్రిక ఉందన్నారు. దళితులపై జరిగిన ఎన్నో దాడులు నిర్మోహమాటంగా ప్రచురించిన ఘనత విశాలాంధ్రకే దక్కుతుందని కొనియాడారు. అవినీతిపరుల ఆట కట్టించే దమ్ము ధైర్యం విశాలాంధ్రకే ఉందన్నారు. కర్లపాలెం జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పత్రిక విలువలు దిగజారుతున్న నేటి సమాజంలో పత్రికా విలువలు పెంచేందుకు విశాలాంధ్ర కృషిచేయాలన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం అవసరమైతే ప్రభుత్వాన్ని నిలదీసేలా వార్తలు ప్రచురించాలని కోరారు. టీడీపీ బాపట్ల పార్లమెంట్ మహిళా అధ్యక్షులు పల్లం సరోజిని మాట్లాడుతూ విశాలాంధ్ర దినపత్రికలో సీనియర్ జర్నలిస్టులు ఎందరో ఉన్నారని పత్రికకు మూలస్థంభం వారే అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ జేబీ శ్రీధర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు షేక్ కరిముల్లా, వైసీపీ బాపట్ల మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు యారం ఇస్సాక్, వీసీకే పార్టీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, సలగల చంటి తదితరులున్నారు.

ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కోన అజయ్‌బాబు, న్యూస్ ఎడిటర్ ఎ.మురళీకృష్ణ, బ్యూరోచీఫ్ చావా రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, జేబీ శ్రీధర్

కర్లపాలెం ఎంపీపీ యారం వనజ, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ కోకి రాఘవరెడ్డి

ఏఎన్‌పీఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ జి.చారవాక, జనసేన నాయకుడు శివన్నారాయణ, టీడీపీ నాయకురాలు పల్లం సరోజిని, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

జగన్ పాలనలో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం

విశాలాంధ్ర-అద్దంకి : జగన్‌రెడ్డి అసమర్థ పాలనలో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, అధికారంలోకి రాగానే 2.30లక్షల ఉద్యోగాలు భర్తీ, ప్రతి ఏటా జనవరి 1న జ్యాబ్ క్యాలెండర్ అంటూ ప్రగల్భాలు పలికిన జగన్‌రెడ్డి నిరుద్యోగుల్ని నిలువునా మోసం చేశారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేక, రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు రాక, స్వయం ఉపాధికి ప్రభుత్వం నుంచి సహకారం లేక యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి,ఉద్యోగాలు లేక రాష్ట్రంలో గత మూడేళ్లలో 21.575మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని పార్లమెంట్ సాక్షిగా కేంద్రమంత్రి వెల్లడించారని ఇది వైసీపీ చేతగాని పాలనకు నిదర్శనం అన్నారు. టీడీపీ 5 ఏళ్ళ పాలనలో పరిశ్రమల ద్వారా 5.13 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారని వైకాపా మంత్రి గౌతమ్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పారని గుర్తుచేశారు. నాలుగేళ్ళ వైసీపీ పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. అమరావతి నిర్మాణంతో 15లక్షల ఉద్యోగాల కల్పనకు చంద్రబాబు శ్రీకారం చుడితే జగన్‌రెడ్డి అమరావతిని నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. జగన్‌రెడ్డి ఇకనైనా యువతను మోసం చేయడం మాని వెంటనే ఉద్యోగాల జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

కలుషిత నీరు తాగేదేలా?

విశాలాంధ్ర - భట్టిప్రోలు : రక్షిత మంచి పథకం ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుందని ఈ నీటిని ఎలా తాగాలంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లేత పసుపు రంగుతో కూడిన నీరు రక్షిత మంచి నీటి పైపుల ద్వారా సరఫరా కావడమే కాక దుర్గంధం వెదజల్లుతుందని అలాంటి నీరు తాగితే రోగాల బారిన పడాల్సిందేనని ఆవేదన చెందుతున్నారు. స్థానిక మార్కెట్ వెనుక 11వ వార్డులో ఆదివారం సాయంత్రం కలుషిత నీరు సరఫరా అయిందని స్థానికులు తెలియజేశారు. మండల కేంద్రమైన భట్టిప్రోలులో ట్యాంకుల నిర్వహణపై పర్యవేక్షణ లేని కారణంగా పలు వార్డుల్లో కలుషిత తాగునీరు సరఫరా అవుతుందని గ్రామస్తులు అంటున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందస్తుగా తగు జాగ్రత్తలు పాటించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. రోగాలు వ్యాపించక ముందే అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టి సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

5న గోగులమ్మ తిరునాళ్ల

విశాలాంధ్ర - భట్టిప్రోలు : మండలంలోని పెదపులివర్రు గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవత శ్రీ గోగులమ్మతల్లి తిరునాళ్ళు ఈ నెల 5న జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. తిరునాళ్ళు మహోత్సవంలో భాగంగా 5న బుధవారం అఖండ దీపారాధన, విఘ్నేశ్వరపూజ, అమ్మవారికి పుట్టింటివారి తరుపున కొసరాజు రాధాకృష్ణమూర్తి, కొసరాజు రమేష్ దంపతులు పసుపు కుంకుమల సమర్పణ, కోలాట నృత్యాలు, రాత్రి గ్రామోత్సవం, 6న నైవేద్యాలు, మొక్కుబడులు జరుగుతాయన్నారు. తిరునాళ్ళ సందర్భంగా ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ ప్రభల ఏర్పాటు చేయనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని దేవాలయ కమిటి సభ్యులు తెలిపారు.

పల్లెకోనలో గంజాయి కలకలం

విశాలాంధ్ర - భట్టిప్రోలు : మండలంలోని పల్లెకోన గ్రామంలో గంజాయి కలకలం రేపింది. భట్టిప్రోలు ఎస్ఐ సురేష్ కదనం ప్రకారం విశాఖపట్నంకు చెందిన శివశంకర్ విశాఖ నుంచి గంజాయిని తీసుకువచ్చి పరిసర గ్రామాల్లో అమ్మకాలు సాగిస్తున్నాడు. శివశంకర్‌తోపాటు కొల్లూరు గ్రామానికి చెందిన ప్రకాష్, రేపల్లెకు చెందిన మునీర్‌లు ద్విచక్ర వాహనాల్లో గంజాయిని తీసుకుని వచ్చి పల్లెకోనలో అమ్మకాలు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి ముగ్గుర్ని అదుపులోకి తీసుకుని కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నా మన్నారు. కేసు నమోను చేసి కోర్టులో హాజరుపరచామన్నారు.

అనంతవరంలో ఉచితం మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని అనంతవరం గ్రామంలో శ్రావణి హాస్పిటల్, గుంటూరు వారిచే ఉచిత మెగా వైద్య శిబిరమును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొని 107 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసీజీ షుగర్ టెస్టులు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని గుంటూరు వైద్యశాలలో నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గుదే తారక రామారావు, కే వంశీకృష్ణ రావి శ్రీనివాసరావు, వైద్య బృందాన్ని అభినందించారు.ఆర్ఎంపి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సీఎం అసమర్థతో రాష్ట్రం అప్పుల పాలు

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అసమర్ధ పాలనతో ఆంధ్ర ప్రదేశ్ అప్పులతొ నిండి పోయిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు గూడపాటి శ్రీనివాసరావు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత యువత ఉపాధి అవకాశాలు కోల్పోయారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జివి నాగేశ్వరరావు, కొక్కిలి గడ్డ వెంకటేశ్వర రావు, అన్నే రామకృష్ణ పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-పర్చూరు: సోమవారం నుంచి జరుగునున్న పది పరీక్షలకు సర్వం సిద్ధం చేసామని మండల విద్యాధికారి డి.నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. మండలంలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలు ఉన్నాయని, వాటిలో మొత్తం 645 మంది విద్యార్థులు పరీక్షలకు హజరవుతారని తెలిపారు. అన్నంభోట్లవారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 64 మంది, పర్చూరులోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ నందు 200 మంది, వైఆర్ హైస్కూల్ నందు 185 మంది, నాగుల పాలెంలోని ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్ నందు 194 మంది రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఇద్దరు ప్రైవేటు విద్యార్థులు ఉన్నారని తెలిపారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

పరీక్ష కేంద్రాలను ఆదివారం ఎస్సై ఎస్‌సీ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రతకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, మాస్ కాపీయింగ్ వంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మొబైల్ ఫోన్స్, స్మార్ట్ వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని, విద్యార్థుల తల్లితండ్రులకు కేంద్రాల లోపలికి ప్రవేశం లేదని, సమయపాలన పాటించి ఎలాంటి అందోళన లేకుండా పరీక్షలు రాయాలని ఎస్సై ఎస్‌సీ ప్రసాద్ తెలిపారు.

హామీలు నెరవేర్చిన ఘనత జగన్‌దే

విశాలాంధ్ర-అద్దంకి : ఎన్నికల హామీలను 98 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని, పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని శాప్‌నెట్ చైర్మన్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. స్థానిక రహదారుల అతిథి గృహం ఆవరణలో ఆదివారం వైసీపీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో కృష్ణచైతన్య మాట్లాడుతూ దేశం గర్వపడే విధంగా ప్రజాసంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్ ఆశయాలను ప్రజల చెంతకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అన్న నినాదంతో ముందుకు సాగుతూ అభివృద్ధి ఫలాలు అందుకుంటున్న లబ్దిదారులకు జగనన్న ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను వివరించాలన్నారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



విశాలాంధ్ర - భట్టిప్రోలు : మండలంలోని క్రైస్తవ సోదరులు మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు ఎరూషలేము ప్రవేశించిన పర్వదినంను పురస్కరించుకుని మండలంలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో సండే స్కూలు చిన్నారులు, మహిళలు, సంఘ కాపరులు, సండే స్కూలు టీచర్లు ఈత మట్టలను రంగు రంగుల పూలతో అలంకరించి హోసన్నా జయము, హోసన్నా జయము నినాదాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవునా క్రైస్తవ సోదరులు చిన్నారులలకు స్వాగతం పలుకుతూ చల్లని పానీయాలు, బిస్కెట్లను అందిస్తూ చిన్నారులను ఉత్సహపరిచారు.

సంక్షేమ పథకాలతో మహిళాభివృద్ధి

విశాలాంధ్ర - రేపల్లె : మహిళల ఆర్థిక అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పలు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ రావు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని నగరం మండల కేంద్రంలో జగనన్న ఆసరా పథకం చెక్కులను పంపిణి చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా మహిళల ఖాతాల్లో నగదు జమచేస్తున్నారని వివరించారు. నగరం మండలంలో ఉన్న1287 స్వయం సహాయక సంఘాలలో మొత్తం 12,870 మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. ఆసరా పథకం మూడవ విడత ద్వారా ఆయా సంఘాలకు 7 కోట్ల 99 లక్షల రూపాయల చెక్కును మహిళా సమాఖ్య సభ్యులకు అందజేశారు. మూడు విడతల్లో కలిపి నగరం మండల మహిళా సంఘాలకు 23 కోట్ల 97 లక్షల రూపాయలు అందించటం జరిగిందన్నారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నగరం ఎంపీపీ చింతల శ్రీ కృష్ణయ్య, డిఆర్డిఏ, వెలుగు అధికారులు ఉన్నారు.

వ్యాపారవేత్తలకు తొత్తులుగా మారిన అధికారులు

- సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - కర్లపాలెం : వ్యాపార వేత్తలకు అను కూలంగా అధికారులు పనిచేయటం మానుకోవాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు. మండలంలోని చింతాయపాలెం పంట పోలాల్లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తున్న ప్రాంతాన్ని పార్టీ నేతలతో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సింగరకొండ మాట్లాడుతూ స్థానిక రైతులతో కనీసం ఒక్క మాట చెప్పకుండా రాత్రికి రాత్రే కర్లపాలెం నుంచి ఇక్కడికి డంపింగ్ యార్డు తరలించటం ఎంతవరకు సబబు అన్నారు. ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త ప్రయోజనం కోసం వందల మంది రైతులకు నష్టం చేకూర్చేలా అధికారుల పనితీరు ఉండటం బాధకరం అన్నారు. తమ ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే పంట పోలాలు దెబ్బతింటాయని రైతులు మొత్తుకున్నప్పటికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించలేదని నిలదీశారు. అధికారంలోకి రాకముందు రైతే రాజు ప్రచారం చేసుకున్న వైసీపీ తీరా అధికారంలోకి వచ్చాక నట్టేట ముంచుతుందన్నారు. డంపింగ్‌యార్డు వల్ల స్థానికంగా సాగునీరు దుర్వాసన వస్తుందని రైతులు తమతో గోడు వెళ్లబోసుకున్నారన్నారు. తాము రైతులకు మద్దత్తుగా ఉంటామని తక్షణమే పంట పోలాలకు ప్రమాదంగా మారిన డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు జేబీ శ్రీధర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి షేక్ కరిముల్లా, చింతాయపాలెం సర్పంచ్ పీటా శ్రీనివాసరావు తదితరులున్నారు.

ఘనంగా మట్టల ఆదివారం

విశాలాంధ్ర - చీరాల : ప్రతీ ఒక్కరు క్రీస్తు మార్గంలో పయనించి ప్రేమ, దయ, కరుణ కలిగి శాంతి మార్గంలో పయనించాలని రెవరెండ్ జోసెఫ్ కేరీ, రెవరెండ్ దేవదాసు అన్నారు. క్రైస్తవసోదరి, సోదరులు, సండే స్కూల్ చిన్నారులతో, సంఘ సభ్యులు అత్యంత భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారాన్ని నిర్వహించారు.మట్టల ఆదివారాన్ని పట్టణంలోని పలు దేవాలయాల్లో క్రైస్తవ సోదరి,సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రార్థనలో పాల్గొన్నారు.ఈ నేపథ్యంలో పట్టణ పరిధిలోని సెయింట్ మార్క్స్ సెంటినరీ దేవాలయం ఆధ్వర్యంలో సండే స్కూల్ చిన్నారులు మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని చర్చి వద్ద నుంచి పట్టణంలో మజీద్ సెంటర్,మార్కెట్ సెంటర్,మండల కార్యాలయం ,గడియార స్తంభం మీదుగా పేరాల మరియు చర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ లో సండే స్కూల్ చిన్నారులు, సండే స్కూల్ టీచర్స్ ర్యాలీలో దావూదు కుమారునికి జయము, ప్రభు పేరట వచ్చి వాడు స్తుతింప బడునుగాక,జై యేసు మహారాజు కే జయము అంటూ దేవుని స్తుతిస్తూ క్రైస్తవ గీతాలు అలపిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చి సంఘ కాపరి జోసెఫ్ కెరీ,రెవరెండ్ దేవదాసు లు దైవ సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పిసిసి చైర్మన్ దేటా అశోక్,ట్రెజరర్ ఏరిచర్ల రమేష్,పోస్టర్స్ రెవరెండ్ జోసఫ్ కెరీ,రెవరెండ్ పిల్లి దేవదాసు,పేతురు బాబు,దేటా దివాకర్, అజయ్,సుధీర్, మోహనరావు, బజ్జిబాబు, సతీష్, గట్టుపల్లి ప్రేమ్ కుమార్,దేటా రవికుమార్, భాస్కర్ రావు,శాంతయ్య,రోహిణి,సందీప్, బొనిగల ప్రకాష్,సండే స్కూల్ టీచర్స్,ధన్రాజ్,సండే స్కూల్ విద్యార్థులు, చిన్నారులు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశాలాంధ్ర - జె.పంగులూరు : మట్టల ఆదివారం పండుగను ఆదివారం పంగులూరులోని క్రైస్తవలు ఘనంగా నిర్వహించారు. ఈత మట్టలకు పూలను గుచ్చి, పిల్లలు, పెద్దలు చేత పట్టుకొని వీధులలో క్రైస్తవ భక్తి పాటలు పాడుతూ ర్యాలీ చేపట్టారు. యూదుల రాజుకు జై, దావీదు తనయునికి జై, అంటూ క్రీస్తుకు జేజేలు పలుకుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.ఈ.సీ.ఐ. సంఘ కాపరి పి. రవి రాజు మట్లల ఆదివారం గురించి పిల్లలకు, క్రైస్తవులకు వివరించి చెప్పారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పాస్టర్ పసికర్ల ఏలియా, సంఘ పెద్ద పాలపర్తి సింగయ్య, పరిమి ప్రసన్న, సునీత, పాలపర్తి నవనీతం, పాలపర్తి సరస్వతి పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - బల్లికురవ : నేటి నుండి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ వీరరాఘవ తెలిపారు. బల్లికురవ జిల్లా పరిషత్ హై స్కూల్, కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాల, వైదన జిల్లా పరిషత్ హై స్కూల్ లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మొత్తం 518 మంది విద్యా ర్థులు విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు బల్లికురవలో 196 మంది కేజీబీవీలో 109 మంది వైదనలో 213 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు.

ఏలూరి ఉచిత కంటి వైద్య శిబారానికి విశేష స్పందన



విశాలాంధ్ర - మార్టూరు : ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్స్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి , అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఆదివారం ఏలూరి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తొలుత స్వర్గీయ నందమూరి తారక రామారావు,స్వర్గీయ ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి క్యాంపును ప్రారంభించారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన వైద్య శిబిరం మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగింది. మొత్తం 554 మంది హాజరుకాగా 250 మందిని కంటి వైద్య శస్త్ర చికిత్సకు వైద్యులు రిఫర్ చేశారు. కంటి వైద్య శిబిరానికి హాజరైన వారికి ప్రత్యేక షామియనాలు వేశారు. పురుషులకు మహిళలకు వేరువేరుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. క్యాంపుకు హాజరైన వారికి బీపీ, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ మోనీషా, డాక్టర్ దృశ్యలు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఏలూరి రాజకీయాలకతీతంగా సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరికి సేవా కార్యక్రమాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, తోండేపు ఆదినారాయణ, కామేపల్లి హరిబాబు, కామినేని జనార్ధన్, పెంట్యాల శరత్, చిరంజీవి పాల్గొన్నారు.

పక్షవాత లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు

విశాలాంధ్ర - చీరాల : పక్షవాత లక్షణాలను మొదటి దశలో గుర్తిస్తే పక్షవాతం వలన వచ్చు సైడ్ ఎఫెక్ట్స్ నుండి కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని, ఫిట్స్ అనేవి ఒక లక్షణమేనని వాటికి అసలైన కారణం కనుక్కొని సరైన చికిత్స అందించాలని డాక్టర్ శరత్ చంద్ర అన్నారు. శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్, చంద్ర న్యూరో కేర్ సెంటర్ గుంటూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో చీరాల రోటరీ క్లబ్ భవనంలో గ్రామీణ ప్రాథమిక వైద్యులకు న్యూరాలజీ, గ్యాస్ ట్రబుల్, జ్వరాలు, షుగర్‌కు సంబంధించిన వ్యాధులపై డాక్టర్ తాడివలస దేవరాజు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు.

నిరుద్యోగ యువత మేలుకో చంద్రబాబు గెలుపు కోరుకో..

విశాలాంధ్ర - చీరాల : రాష్ట్రంలో ఉద్యోగ కల్పన లేక నిరుద్యోగ యువత నిర్వీర్యం అయిపోతుందని నిరుద్యోగ యువత మేల్కొని చంద్రబాబు గెలుపు కోరుకోవాలని టిడిపి నాయకులు గజవల్లి శ్రీను అన్నారు. చీరాల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి మద్దులూరి మాలకొండయ్య ఆదేశానుసారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. టీడీపీ నాయకులు గంజి పురుషోత్తం, కౌతవరపు జనార్దన్‌లు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ అసమర్ధ పరిపాలనలో నిరుద్యోగం విలయతాండవం చేస్తుందని, 2014 నుండి 2019 సంవత్సరం వరకు తెలుగు దేశం ప్రభుత్వంలో 5,13,000 ప్రైవేటు,ప్రభుత్వం నుండి ఉపాధి అవకాశాలు కల్పించారని అన్నారు.వైసీపీ అధి కారం చేపట్టి నాలుగేళ్లు అయిన వాలంటరీ,సచివాలయం ఉద్యోగాలు తప్పించి ఏ ఉపాధి రంగాల్లోనైనా యువతకి ఉపాధి చూపించలేకపోయారని అన్నారు.

రాజకీయ కురవృద్ధుడు మేకల సుబ్బారావు మృతి

- మాజీ కేంద్రమంత్రి జేడీ శీలం నివాళులు

విశాలాంధ్ర - కర్లపాలెం : మండలంలో 5 దశాబ్దాలుగా క్రీయాశీలక రాజకీయాల్లో చురకైన పాత్ర పోషించిన పేరలి మాజీ సర్పంచ్ మేకల సుబ్బారావు (80) ఆదివారం తెల్లవారుఝామున మృతి చెందారు. సుబ్బారావు మరణవార్త తెలుసుకున్న వివిధ రాజకీయ పార్టీల నేతలు,ప్రజా సంఘాల నేతలు నివాళులర్పించారు. సుబ్బారావు గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్ గా, గుంటూరు జిల్లా మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ గా, పేరలి వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా రెండుసార్లు, పేరలి పంచాయతీ సర్పంచ్ గా మూడుసార్లు, ఎంపీటీసీగా మేకల సుబ్బారావు వివిధ పదవులను అలంకరించారు. కాంగ్రెస్ హయాంలో మాజీ గవర్నర్ కోనా ప్రభాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అనంత వర్మ రాజు, మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డితో కలిసి పనిచేసిన విశేషా అనుభవం ఉంది. ప్రస్తుత శాసనసభ్యులు కోన రఘుపతి గారికి ఎంతో ఇష్టమైన నేతగా మేకల సుబ్బారావు కి పేరు ఉంది. కర్లపాలెం మండల దళిత సామాజిక వర్గంలో పెద్దదిక్కుగా ఉంటూ ఆకస్మికంగా మృతి చెందటంపై కర్లపాలెం మండల ప్రజానీకం దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. పేరలి పాతపాలెంలోని ఆయన స్వగృహంలో ఆదివారం ఆయన భౌతికకాయానికి పలువురు రాజకీయ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ శాసనసభ్యులు చీరాల గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంటా అంజిబాబు, కేర్ సంస్థ వ్యవస్థాపకులు మోపర్తి జాన్, విశ్రాంత తహసిల్దార్ అంకారావు, కర్లపాలెం ఎంపీపీ వనజ, జడ్పిటిసి పిట్ల వేణుగోపాల్ రెడ్డి, సర్పంచ్ మల్లెల ఆదాము, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కాగిత బుల్లియ, అంబేద్కర్ సేవా సమాజం గౌరవ అధ్యక్షుడు మందపాటి పరమానంద కుమార్, మాజీ సర్పంచ్ కాగిత విజయరాజు, మండల వైసీపీ పార్టీ అధ్యక్షుడు సీతారామిరెడ్డి, టిడిపి మండలాధ్యక్షుడు ఏపూరి భూపతి రావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. మేకల సుబ్బారావుకు మొత్తం నలుగురు సంతానం ఇద్దరు కుమార్తెలు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు పలి బాబు వీఆర్వోగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా పేరలి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సోమవారం ఉదయం మేకల సుబ్బారావు భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.